మాజీ డిప్యూటీ మేయర్ దంపతులకు సన్మానం



మాజీ డిప్యూటీ మేయర్ దంపతులను సన్మానిస్తున్న కొండ దేవయ్య

విద్యానగర్, ఫిబ్రవరి 8: కరీంనగర్ మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి–హరిశంకర్ దంపతులను శనివారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచి సేవలతోనే ఉత్తమ గుర్తింపు లభిస్తుందని, మనం చేసిన మంచి పనులే మనకు సంతృప్తినిస్తాయని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి–హరిశంకర్ రాబోయే రోజుల్లో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, నాయకులు ఆవుల శ్రీనివాస్, పురేళ్ల శ్రవణ్, కుల బాంధవులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ విడుదల

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8 : భారతీయ విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ మార్చి 27న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు సందెపోగు ఉదయ్ కుమార్ హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతున్నదని, దీనిని తిప్పి కొట్టే దిశగా విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో వీసీల నియామకాన్ని కేంద్రం చేతుల్లోకి తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని, ఇది రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాటి కొండ రవి, కార్యదర్శి మాదం తిరుపతి, రాష్ట్ర నాయకత్వం వెంకటేశ్వర్లు, పెద్ది సూరి, గణేశ్, తిరుపతి, రంగస్వామి, రాహుల్, శ్వేత, నీలిమ, శేఖర్, జగన్ పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకే మేళా

- స్వదేశీ మేళా బాధ్యులు చల్మెడ రాజేశ్వరరావు, ముక్క హరీశ్ బాబు

విద్యానగర్, ఫిబ్రవరి 8: స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో స్వదేశీ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్వదేశీ మేళా బాధ్యులు చల్మెడ రాజేశ్వరరావు, ముక్క హరీశ్ బాబు తెలిపారు. స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16 వరకు కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో తలపెట్టిన 'స్వదేశీ మేళా' ప్రారంభం కోసం శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరు రోజుల పాటు జరిగే ఈ స్వదేశీ మేళాలో దాదాపు 2 లక్షల మంది పాల్గొనేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా దేశీయ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. 210కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తామని, ఉద్యోగాల కల్పన కోసం 120 కంపెనీలు స్వదేశీ మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. అలాగే 9న ఉదయం 6 గంటలకు కరీంనగర్‌లోని పలు ప్రాంతాల మీదుగా సైకిల్ ర్యాలీ, 10న మారథాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. స్వదేశీ మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వదేశీ మేళా బాధ్యులు మాధవరావు, నిరంజనాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, గంప వెంకట్, కళ్లెం వాసుదేవ రెడ్డి, గోపీకృష్ణ, పాక సత్యనారాయణ, వేద పండితుడు మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ మేళా పనులకు భూమి పూజ చేస్తున్న బాధ్యులు

పంటల నమోదుకు డిజిటల్ సర్వే

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 8: కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాల్లో పంటల డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం 17 గ్రామాల్లో సాగవుతున్న పంటల వివరాలను ఏఈవోలు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. దుర్శేడ్ క్లస్టర్‌లో ఏఈవో పైడితల్లి, నగునూర్ క్లస్టర్‌లో జాఫరుల్లా, చామనపల్లి క్లస్టర్ పరిధిలో తాళ్లపల్లి సుచరిత, మొగ్దుంపూర్ క్లస్టర్ పరిధిలో స్వర్ణలత క్రాప్ సర్వే నిర్వహిస్తున్నారు. 17 గ్రామాల్లో సాగులో ఉన్న 15,364 ఎకరాల్లో సర్వేనంబర్ల వారీగా రైతులు ఏ పంట వేశారో క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి, డీసీఎస్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. మొదట మండలంలో ఎక్కువ సర్వేనంబర్లున్న క్లస్టర్‌లోని గ్రామాలను ఎంపిక చేశారు. పంటల నమోదు ప్రక్రియ ఆరు వారాల పాటు కొనసాగుతుందని మండల వ్యవసాయ అధికారి సత్యం తెలిపారు.

10 నుంచి సదరం క్యాంపులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : జిల్లాలోని దివ్యాంగులకు వైకల్య ధ్రువీకరణ నిర్ధారణ కోసం ఈ నెల 10 నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీధర్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చేపట్టే ఈ శిబిరాలకు హాజరయ్యేందుకు ప్రకటించిన తేదీలకనుగుణంగా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. 10 నుంచి 12వ తేదీ వరకు శారీరక వైకల్యం, 13న మూగ, చెవుటి, 17న కంటి చూపు, 18న మానసిక వైకల్య ధ్రువీకరణ శిబిరాలు కొనసాగుతాయని వెల్లడించారు. కొత్తగా 1250 మందికి, తాత్కాలికంగా 350 మందికి మొత్తంగా 1600 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో బుక్ చేసుకుని వెయిటింగ్ జాబితాలో ఉన్నవారు, ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న వారి మొబైల్ నంబర్లకు క్యాంపునకు రావాల్సిన తేదీల వివరాలతో కూడిన సమాచారం పంపనున్నట్లు తెలిపారు. గతంలో పొందిన సదరం సర్టిఫికెట్ కాలపరిమితి పూర్తయిన వారు పునరుద్ధరణ కోసం పరిమిత స్లాట్‌లు ఆదివారం నుంచి మీసేవలో బుక్ చేసుకునేలా అవకాశం కల్పించినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుధ్యం మెరుగు పరచాలి: నగర కమిషనర్

కార్పొరేషన్/కొత్తపల్లి, ఫిబ్రవరి 8 : కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని అధికారులు, సిబ్బందిని నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శనివారం కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు బొమ్మకల్ గ్రామంలో కమిషనర్ పర్యటించి పరిశుభ్రతను పరిశీలించారు. నగరపాలక సంస్థలో 60 డివిజన్లలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నట్లుగానే విలీన గ్రామాలు, మున్సిపాలిటీలో జరుగాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి కార్మికులకు అందించాలని.. పరిసర ప్రాంతాలు డ్రైనేజీల్లో వేస్తే నగరపాలక సంస్థ చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామీ, వార్డు ఆఫీసర్, జవానులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి: డీఈవో

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డీఈవో

మానకొండూర్, ఫిబ్రవరి 8: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 1879లో ప్రారంభమైన ఈ పాఠశాల ఎంతో మంది విద్యార్థులను విద్యావేత్తలుగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూదనాచారి, బీసీ బాలుర వసతిగృహ సంక్షేమ అధికారి రాజ్ మహ్మద్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుగకుండా కుట్రలు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 8: మున్నూరుకాపు కులస్తులను రాజకీయంగా ఎదుగకుండా కొన్ని వర్గాలు కుట్రలు చేస్తున్నాయని, అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో తమ సామాజిక వర్గం జనాభాను తక్కువ చేసి చూపించారని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర సర్వేలో మున్నూరుకాపు జనాభా 28లక్షలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 13 లక్షలకు తగ్గడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 15లక్షల మున్నూరుకాపు జనాభా ఏమైనట్లో ప్రభుత్వం లెక్కలు చెప్పాలన్నారు. కులగణన సర్వే నివేదికపై బీసీ సంఘాలు, రాజకీయపార్టీల విమర్శలు చేస్తున్న నేపథ్యంలో కులగణనను మళ్లీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన ఉపాధి కూలీలకు పరిహారం చెల్లించాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 8: ఉమ్మడి జిల్లాలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి కూలీలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఉపాధి కూలీల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాచకొండ మనోహర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిద్దిపేట జిల్లా గోవర్ధనగిరిలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఉపాధి హామీ పని ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మరణించగా, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయిన బాధితురాలికి రూ.20లక్షల పరిహారం చెల్లించాలని, వారి కుటుంబాల్లో అర్హులైన వారికి ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు మల్యాల రాజయ్య, మిలుకూరి వెంకటేశ్వర్లు, బెజ్జారపు శ్రీధర్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాల ప్రవేశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, అండ్ సైన్స్ కళాశాలలో రాబోయే విద్యా సంవత్సరం 2025–26 ప్రవేశాల ప్రచార పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యాపక బృందంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్సారార్ కళాశాల ప్రస్తుత సంవత్సర అడ్మిషన్లలో రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, రాబోయే సంవత్సరంలో కూడా ఇదేవిధంగా అడ్మిషన్లు రావడానికి అధ్యాపకులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి. నితిన్ పాఠక్, టి. రాజయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమత్ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8 : కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు హనుమత్ వాహనంపై విహరించారు. ఉత్సవ మూర్తులకు సహస్ర దీపాలంకరణ సేవ నేత్రపర్వంగా కొనసాగింది. సాయంత్రం గోగుల ప్రసాద్ నేతృత్వంలో కళా వేదికపై నటరాజ నృత్యాలయ బృందం మాస్టర్ సుభాన్ మోహన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం సురభి నాటక బృందం ప్రదర్శన ఆకట్టుకున్నది. కాగా, నేడు మహాపూర్ణాహుతి, పుష్పయాగం, వసంతోత్సవం, చక్రస్నానం జరుగనున్నాయి.

ఎస్సీ, ఎస్టీ కేసుపై ఏసీపీ విచారణ

చిగురుమామిడి, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని వైన్‌షాప్ పక్కన ఉన్న పర్మిట్ రూమ్ నిర్వహించే సావుల నాగార్జున ఫిర్యాదు మేరకు గోరింకల సతీశ్ అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా, శనివారం కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎస్ఐ రాజేశ్ ఉన్నారు.

బీఫార్మసీ ఫీజు చెల్లింపునకు 15 ఆఖరు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీ ఫార్మసీ ఐదో, ఏడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఆరో, ఎనిమిదో సెమిస్టర్, సప్లిమెంటరీ ఫీజు చెల్లించేందుకు 15 ఆఖరు గడువని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో 19వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. వివరాలకు విద్యార్థులు కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 8: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకుడు పీ ప్రసాద్, రాష్ట్ర మహిళా సెక్రటరీగా పౌరనీతి శాస్త్ర అధ్యాపకురాలు కే సుగుణ ఎన్నికయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను డీఐఈవో జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయ రావు, మదన్మోహన్ రావు, హర్షం జనార్ధన్, రాజ మౌళి, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE AT HANAMKONDA
O.S.No. 208 OF 2022
Between:
Smt. Koka Kiranmay
represented through her GPA Holder
Gurukuntla Rajender ...Plaintiff
AND
Dukire Rajeshwar Rao and others
...Defendants
NOTICE
To,
Smt. Vadije Uma, W/o. Srinivas, Aged about 38 years, Occ: Agriculture R/o. Papaiahpally Village, Huzurabad Mandal, Karimnagar District.
Please take notice that the above named Plaintiff filed a suit against you for Declaration of Title and consequential relief of Permanent Injunction. The above case is posted to 21-02-2025 for your appearance. Therefore, you are hereby required to appear before the above said court in person or through an advocate and file answer if any, on 21-02-2025 at 10.30 A.M before the above Hon'ble Court. Otherwise the matter will be decided as per law.
// BY ORDER OF THE COURT //
Sd/- CH. CHIDAMBARNATH
ADVOCATE-WARANGAL , SRI SHIVANANDA LAHARI, H N 11-23-2175, GANESH NAGAR, TEACHER'S COLONY, DESAIPET ROAD, WARANGAL.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 8: రెడ్డి కులస్తులను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం గణేశ్ నగర్ అధ్యక్షుడు హన్మాండ్ల జనార్దన్‌రెడ్డి సంఘ సభ్యులతో కలిసి శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు సందర్భంగా ఒక్క వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని కుట్ర పూరితంగా దుర్భాషలాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డైట్‌లో దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 8: ఎల్ఎండీ కాలనీలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న అధ్యాపక స్థానాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన శాస్త్ర బోధన పద్ధతులు, కళా విద్య కోర్సులు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో.. సైకాలజీ ఫిలాసఫీ, సాంఘిక శాస్త్రం ఉర్దూలో బోధించేందుకు ఆయా సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈడీ, బీఈడీ అర్హతలు ఉండాలని పేర్కొన్నారు. అర్హతలుండి ఉద్యోగ విరమణ పొందిన వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల14 లోగా ఎల్ఎండీలోని డైట్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఫిబ్రవరి 8: విద్యానగర్ 11కేవీ ఫీడర్‌లో ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏడీఈ ఎం లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యానగర్, విజయదుర్గ కాలనీ, ఆర్టీసీ వర్క్ షాప్ వెనుక ప్రాంతం, రత్నం స్కూల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 8: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు గ్రామానికి చెందిన మామిడి మొండయ్య గ్రామ శివారులోని మానేరువాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నాగేంద్ర వైన్ షాపు ముందు పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, మామిడి మొండయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 18 నుంచి 19 వరకు జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టు ఎంపికలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్. మహిపాల్, కె. రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్–14, 16, 18, 20 సంవత్సరాల బాల బాలికలకు ఎంపిక పోటీలను క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కొత్తపల్లి, ఫిబ్రవరి 8: చింతకుంట గ్రామంలోని శ్రీ చైతన్య సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు సుడా చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా, సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో రాణించిన క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తాచాటాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ సీమా తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ డీ రామయ్య

వేడుకల్లో పిల్లలతో కలిసి నృత్యం చేస్తున్న పేరెంట్స్

అట్టహాసంగా 'అద్వితోత్సవ్-25'

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8: జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ అద్విత ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవం శనివారం అంబేద్కర్ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించారు. వేడుకలను విశిష్ట అతిథి శాస్త్రవేత్త, బిట్స్ ప్రొఫెసర్ డి. రామయ్య, విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య సౌగాని, అద్విత పాఠశాల డైరెక్టర్ అనుదీప్ సౌగాని, డాక్టర్ రఘు రామన్, గండ్ర లక్ష్మణ్ రావు, గాజుల రవీందర్ ప్రారంభించారు. అనంతరం అద్విత ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ అనుదీప్ పాఠశాల వార్షిక నివేదికను ప్రజెంట్ చేశారు. జిల్లాలోనే ప్రథమంగా అంతర్జాతీయ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఆమోదిత గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్నారులకు అదే స్థాయిలో చక్కని విద్యా ప్రణాళికతో ప్రయోగపూర్వక అనుభవాలు, చక్కని కమ్యూనికేషన్స్ స్కిల్స్, నైతిక విలువలు, శారీరక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు అద్వితీయ నృత్య ప్రదర్శనలతో కార్యక్రమాన్ని ఆద్యంతం హోరెత్తించారు. చిన్నారులు ప్రత్యేక నృత్య వేషధారణలతో అద్భుతంగా నృత్యాలు ప్రదర్శించి అతిథులు, తల్లిదండ్రులను అబ్బురపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేతా మాధురి, వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దాస్యం'కు సినారె పురస్కార ప్రదానం

పురస్కారం అందుకుంటున్న దాస్యం సేనాధిపతి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8: కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి సాహిత్యంలో చేస్తున్న విశేష కృషికి హైదరాబాద్ మల్కాజిగిరి అక్షరకౌముది సాంస్కృతిక సాహితీ సంస్థ రాష్ట్ర స్థాయి సినారె పురస్కారాన్ని ప్రదానం చేసింది. సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం చేతులమీదుగా పురస్కారాన్ని సేనాధిపతికి అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, మహిళా పారిశ్రామిక వేత్త రాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తులసి వెంకట రమణాచార్యులు, ప్రధాన కార్యదర్శి మూర్తి శ్రీదేవి, తులసి విజయలక్ష్మి, మాధవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు దాస్యం సేనాధిపతికి అభినందనలు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చొప్పదండి, ఫిబ్రవరి 8 : చొప్పదండి పట్టణంలోని విజయనగరం కాలనీకి చెందిన సామల తిరుపతి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. చొప్పదండి ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. సామల తిరుపతి అత్తమ్మ హుస్నాబాద్‌లో మృతిచెందగా, కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రహరీ గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా, ఇంటి తలుపు తాళం పగలగొట్టి కనిపించింది. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా హాల్‌లో, బెడ్రూంలో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్రూంలోని బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి ఆభరణాలు, కొంత నగదు కనిపించలేదు. రూ. 96 వేల విలువచేసే సొమ్ము, సొత్తు చోరీ అయ్యాయని సామల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు చొప్పదండి ఎస్ఐ అనూష తెలిపారు. ఎవరైనా ఇల్లు వదిలి, వేరే ఊరికి వెళ్లాల్సి వస్తే పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. ఆ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలు జరుగకుండా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

రాంనగర్, ఫిబ్రవరి 8: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్‌లో ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన రేవంత్ కుమార్, ధర్మారం మండలం నందిమేడారానికి చెందిన బీ అభిరామ్, సుల్తానాబాద్ మండలం నీరుకుళ్లకు చెందిన పీ నాగరాజు కలిసి గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం